# ప్రజా మాటల

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు




శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎబోలా అలర్ట్ సుడాన్ ప్రయాణికుడికి లక్షణాలు, గాంధీకి తరలింపు


ప్రచురణ : జగిత్యాల  సంపుటి : 05  సంచిక : 300  పేజీలు : 04  వెల రూ. 2  శుక్రవారం 05 - 06 - 2026


## సాగునీటి ప్రాజెక్టుల పనులపై

# ప్రభుత్వం దృష్టి

- పాలమూరు పర్యటనలో రేవంత్ రెడ్డి
- కాట్రేవుపల్లి ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన
- పాలమూరు ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మక్తల్ పర్యటన
- కాట్రేవుపల్లిలోని మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన
- సీఎంతో పాటు కర్ణాటక మాజీ మంత్రి బోసురాజు



**హైదరాబాద్ :**

పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతుల పరిశీలనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి జిల్లాలోని నారాయణపేట-కొడంగల్, పాలమూరు-రంగారెడ్డితో పాటు పెండింగ్ ప్రాజెక్టుల పనులను క్షేత్రస్థాయిలో పరిశీస్తున్నారు. సాయంత్రం కొల్లాపూర్‌లోని సోమశిలలోనే సీఎం బస చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులపై అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. రేపు పీఆర్ఎల్ఐ ప్రాజెక్టులోని ప్యాకేజీలను పరిశీలించుకుంటూ వచ్చిన అనంతరం జడ్చర్లలో భారీ బహిరంగ సభలో పాల్గొనున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టుల పనులపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో సందర్శించి పనుల పురోగతిని పరిశీలించేందుకు సీఎం రేవంత్ పాలమూరు జిల్లాలో పర్యటిస్తున్నారు. ఇవాళ, రేపు మొత్తం ఉమ్మడి - మిగతా 2 లో

## 50 నుంచి 100 శాతం

# భూముల విలువ పెంపు



- కీలక వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి
- జూన్ 5 నుంచి కొత్త రేట్లు అమల్లోకి రానున్నాయని ప్రకటించిన ప్రభుత్వం
- ఈ పెంపుతో ఖజానాకు రూ.1,400 కోట్ల అదనపు ఆదాయం అంచనా
- రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు లేదని, సబ్-రిజిస్ట్రార్ల అధికారాలకు కోత విధించినట్టు వెల్లడి

**హైదరాబాద్ :**

తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భూముల విలువలు 50 నుంచి 100 శాతం వరకు పెరగనున్నాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాకు అదనంగా సుమారు రూ.1,400 కోట్ల ఆదాయం వస్తుందని - మిగతా 2 లో

## పవన్ సభకు అనుమతి

# ఎందుకు ఇవ్వలేదు



- తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామ్‌చందర్ రావు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని ఎద్దేవా
- ఎవరైనా, ఎక్కడైనా సభ పెట్టుకునే హక్కు ఉందని వ్యాఖ్య
- రాజకీయ పరిస్థితులను బట్టి తెలంగాణలో పొత్తు ఉంటుందని వివరణ
- జనసేనతో పొత్తుపై హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని వెల్లడి

**హైదరాబాద్ :**

తెలంగాణలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ సభ పెడతానంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. - మిగతా 2 లో

# మళ్లీ డీలిమిటేషన్ బిల్లు

- ప్రాంతీయ పార్టీలతో కేంద్రం రహస్య సంప్రదింపులు!
- డీలిమిటేషన్ బిల్లుపై కేంద్రం మరోసారి కసరత్తు చేస్తున్నట్లు సమాచారం
- 2029 ఎన్నికల లోపే పూర్తి చేయాలని యోచన
- ప్రాంతీయ పార్టీలతో కేంద్రం సంప్రదింపులు
- గతంలోని వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని ఆచితూచి అడుగులు
- ఏకాభిప్రాయం కోసం ముందస్తు చర్చలు



**ఢిల్లీ :**

నియోజకవర్గాల పునర్విభజన బిల్లును మరోసారి తెచ్చే యోచనలో కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది. 2029 లోక్‌సభ ఎన్నికల కంటే ముందే ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి కసరత్తు చేస్తోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయితే ఇది సున్నితమైన అంశం కావడంతో ఎలాంటి వివాదాలకు తావులేకుండా రాజకీయంగా ఏకాభిప్రాయం సాధించాలని ప్రభుత్వం యత్నిస్తున్నట్లు సదరు వర్గాలు వెల్లడించాయి. ఈ సంప్రదింపుల్లో భాగంగా కేంద్రం ఇప్పటికే తమిళనాడుకు చెందిన డీఎంకేతో పాటు పలు కీలక ప్రాంతీయ పార్టీలతో ప్రాథమిక చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్య 1971 జనాభా లెక్కల ఆధారంగానే చేసి ఉంది. ఆ గడువు ముగియనుండటంతో కొత్తగా పునర్విభజన చేపడితే జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు సీట్లు పెరిగి, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా నష్టపోతాయనే తీవ్ర ఆందోళనలు ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అందరికీ ఆమోదయోగ్యమైన ఫార్ములాను రూపొందించేందుకు కేంద్రం యత్నిస్తోందని సమాచారం. నిజానికి ఇటీవలే కేంద్ర ప్రభుత్వం - మిగతా 2 లో

## చంచల్‌గూడ జైల్లో బాల్క సుమన్‌ను కలిసిన కేటీఆర్

- సింగరేణి ఆస్తులను ధ్వంసం చేయాలంటూ బాల్క సుమన్ వ్యాఖ్యలు
- చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సుమన్
- కేటీఆర్‌తో పాటు జైలుకు వెళ్లిన తలసాని, సుధీర్ రెడ్డి



**హైదరాబాద్ :**

చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈరోజు ములాఖత్‌లో కలిశారు. కేటీఆర్‌తో పాటు పార్టీ సీనియర్ నేతలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సుధీర్ రెడ్డి కూడా బాల్క సుమన్‌ను - మిగతా 2 లో

## ఎట్టకేలకు కేరళను తాకిన రుతుపవనాలు

- మూడు రోజులు ఆలస్యంగా దేశంలోకి ప్రవేశం
- దేశవ్యాప్త వర్షాకాలానికి ఆరంభం
- రైతుల్లో కొత్త ఆశలు
- జులై మధ్య నాటికి దేశమంతటా విస్తరించే అవకాశం
- దేశ ఆర్థిక వ్యవస్థకు ఊరటనిచ్చే వార్త



**కేరళ :**

దేశవ్యాప్తంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు కేరళ తీరాన్ని తాకాయి. ఈ విషయాన్ని భారత వాతావరణ శాఖ గురువారం అధికారికంగా ప్రకటించింది. సాధారణంగా జూన్ 1వ తేదీన రావాల్సిన రుతుపవనాలు, ఈసారి మూడు రోజులు - మిగతా 2 లో

## అమిత్ షాపై వివాదాస్పద వ్యాఖ్యలు

- మమతా బెనర్జీపై కేసు నమోదు!
- హోం శాఖపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపణలు
- బంగ్లాదేశ్ నేత హాదీ హత్య వెనక కేంద్రం ఉందన్నారని ఫిర్యాదు
- దేశ ప్రతిష్ఠ దెబ్బతీసేలా మాట్లాడారని పోలీసులకు న్యాయవాది ఫిర్యాదు

2 లో



## ప్రజానాడి



## దమ్ముంటే నన్ను

# అరెస్ట్ చేయండి



- వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని
- బియ్యం దొంగతనం చేశానని తనపై ఆరోపణలు చేస్తున్నారన్న పేర్ని నాని
- దమ్ముంటే విచారణ జరిపి జైల్లో పెట్టాలని సవాల్
- డీఎస్సీలో చేసిన పాపాలు చంద్రబాబును, మంత్రులను వదిలిపెట్టవని వ్యాఖ్య

**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో డీఎస్సీ, స్పోర్ట్స్ కోటా ఉద్యోగాల భర్తీ వ్యవహారం ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. ఈ అంశంపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. - మిగతా 2 లో

## లండన్ ఐ తరహాలో అమరావతిలో

# ‘అమరావతి ఐ’

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఏపీ కేబినెట్ భేటీ..
- లండన్ ఐ తరహాలో అమరావతిలో ‘అమరావతి ఐ’ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం
- గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 125 రోజులకు పెంచుతూ కీలక నిర్ణయం
- పోలవరం ఎడమ కాలువకు సవరించిన అంచనాలు, పలు పారిశ్రామిక ప్రాజెక్టులకు భూకేటాయింపులు



**అమరావతి :**

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేసే పలు చారిత్రాత్మక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది.

రాజధాని అమరావతికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చే ‘అమరావతి ఐ’ ప్రాజెక్టు నుంచి గ్రామీణ పేదల బతుకులకు భరోసా ఇచ్చే కొత్త ఉపాధి హామీ పథకం వరకు దాదాపు 35కు పైగా కీలక అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించి ఆమోదముద్ర వేసింది. సమావేశం అనంతరం సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను సమగ్రంగా వివరించారు. లండన్, దుబాయ్ నగరాల్లోని ఐకానిక్ నిర్మాణాల తరహాలో, కృష్ణా నది ఒడ్డున ఆరు ఎకరాల విస్తీర్ణంలో ‘అమరావతి ఐ’ నిర్మాణానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో 30 ఏళ్ల లీజు ప్రాతిపదికన ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. దీనికోసం టెండర్లు ఆహ్వానించేందుకు మంత్రివర్గం అనుమతి ఇచ్చింది. ఈ ప్రాజెక్టు ద్వారా అమరావతి, కృష్ణా నది అందాలను పర్యాటకులు వీక్షించేందుకు వీలు కలుగుతుందని, ఇది ప్రపంచ పర్యాటక పటంలో అమరావతికి

- మిగతా 2 లో

ప్రజా మాటలు
శుక్రవారం 05 - 06 - 2026

# సంపాదకీయం

## పాడి పరిశ్రమలో ఇంధన పొదుపు ఇలా

ఇరాన్-అమెరికా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియని పరిస్థితి! మన దేశంలో ప్రతి రంగమూ ఇంధన సరఫరా, వినియోగాలపైనే ఆధారపడి ఉంది. ఇంధన పొదుపు పాటించాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుతో రాజకీయ నాయకులు స్పందించడం శుభసూచకం. ఇది మనందరికీ ఆదర్శనీయం.ఉభయ తెలుగు రాష్ట్రాలలో అనేక డెయిరీ కంపెనీలు ప్రతిరోజూ రెండూ పూటలా లారీలు, ట్రాక్టర్లు, ఆటోలలో అనేక వేల గ్రామాల నుంచి తమ డెయిరీలు, పాల శీతల కేంద్రాలు, బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్లకు పచ్చిపాలను రవాణా చేస్తున్నాయి. అలాగే శీతలపరచిన లేదా పాశ్చురైజ్డ్ పాలను మరల వినియోగ కేంద్రాలకు ట్యాంకర్లు, లారీలలో తరలిస్తున్నాయి. రైల్వేలు, రోడ్డు రవాణా సంస్థల తర్వాత అత్యధికంగా డీజిల్‌ను వినియోగించేది డెయిరీ రంగమే! కొన్ని చర్యల్ని పాటిస్తే డీజిల్ వినియోగం చాలా వరకు తగ్గుతుంది.పూర్వం ఈ డెయిరీలు తమ పాల సేకరణను ఒకటి, రెండు జిల్లాలకు పరిమితం చేసేవి. గత కొన్నేళ్లుగా అనేక ప్రైవేటు డెయిరీలు ఈ రంగంలోకి ప్రవేశించడంతో సహకార, డెయిరీ కంపెనీలు తమ వ్యాపార మనుగడ కోసం సుదూరంగా ఉన్న జిల్లాల్లోని గ్రామాల్లో కూడా పచ్చిపాలను సేకరించి తమ తమ ఉత్పత్తుల కేంద్రాలకు తరలిస్తున్నాయి. వీరి మధ్య ఏర్పడ్డ పోటీ వల్ల ఒకే గ్రామం లేదా జిల్లాలో 3--4 డెయిరీలు పాల సేకరణ చేపట్టడం వల్ల రవాణా వాహనాల సంఖ్యతో పాటు ఇంధన వినియోగం గణనీయంగా పెరిగింది. వివిధ డెయిరీలు సమన్వయంతో వారి వారి అవసరాలకు అనుగుణంగా పాల సేకరణ పరిధుల్ని నిర్ణయించుకుని, క్రమశిక్షణను పాటిస్తే వాహనాల ఇంధన వినియోగం ఆదా అవుతుంది. కొన్ని గ్రామాల కూడళ్లలో మినీ మిల్క్ చిల్లింగ్ సెంటర్లు (బల్క్ మిల్క్ కూలర్లు)ను ఏర్పాటు చేస్తే ఈ కేంద్రాలలో 3--4 పూటల్లో సేకరించిన పాలను ఒకేసారి ట్యాంకర్లలో ప్రధాన డెయిరీలకు తరలించవచ్చు. దీంతో రవాణా, ఇంధన వ్యయం చాలా వరకు తగ్గుతుంది. ఈ బల్క్ కూలింగ్ సెంటర్లకు సౌరశక్తిని వినియోగిస్తే ఖర్చు నామమాత్రంగా ఉంటుంది.జాతీయ పాడి పరిశోధనా సంస్థ నాలుగు దశాబ్దాల నాడే విశేష పరిశోధనల ద్వారా రూపొందించిన రసాయనాలతో పచ్చిపాలను నిల్వ చేస్తే, అవి సాధారణ ఉష్ణోగ్రతలోనే రెండు మూడు రోజుల వరకు నిల్వ ఉంటాయి. ఈ పాలను డెయిరీలో పాశ్చురైజ్ చేసి వినియోగదారులకు సరఫరా చేశాక వారు తమ గృహాలలో వాటిని వేడి చేస్తే... అందులో కలిపిన రసాయనాలు ఆవిరైపోతాయి. దీంతో వినియోగదారుల ఆరోగ్యానికీ, పాల ఉత్పత్తుల రంగూ రుచీ నాణ్యతకూ ఎటువంటి హానీ ఉండదు. శ్రీలంక, బంగ్లాదేశ్, కొన్ని ఆఫ్రికా దేశాలలో ఈ విధానం అమలులో ఉంది. దీనిని మన దేశంలో అమలుచేయడానికి ఆహార కల్తీ నివారణ చట్టాన్ని సవరించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది.పాల రవాణాకు వాడే వాహనాలను విద్యుత్ వాహనాలుగా మారిస్తే రోజూ కొన్ని లక్షల లీటర్ల డీజిల్ వినియోగం ఆదా అవుతుంది. ఈవీ వాహనాల రీచార్జింగ్ సదుపాయాలను పాల శీతల కేంద్రాలు, డెయిరీల వద్ద ఏర్పాటు చేయాలి. ఈవీ వాహనాల మార్పునకు అవసరమయ్యే పెట్టుబడిని కాంట్రాక్టర్లకు డెయిరీలు ఏర్పాటుచేసి, నెలవారీ బిల్లుల్లో మినహాయించుకోవచ్చు. డెయిరీ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది వినియోగించే వాహనాలను కూడా విద్యుత్ వాహనాలుగా మార్చాలి. ఇకపై కంపెనీలు కొనే వాహనాలన్నీ ఇవే కావాలి. ఒకే వాహనంలో నలుగురు సిబ్బంది కలిసి ప్రయాణం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.డెయిరీ భవన సముదాయాలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవాలి. వీటిలో 70--80 డిగ్రీల వరకు సూర్యశక్తి వల్ల వేడెక్కిన నీటిని బాయిలర్స్‌లోకి పంపి ఆవిరిని ఉత్పత్తి చేస్తే, బాయిలర్స్‌లో వాడే ఫర్నేస్ ఆయిల్ లేదా బొగ్గు వినియోగం సగానికి పైగా తగ్గుతుంది. ఈ విధానాన్ని 35 ఏళ్లనాడే మేఘాలతో చల్లగా ఉండే ఊటీ డెయిరీలో గుర్తించాను. అలాగే ఖాళీ పాల ప్యాకెట్లను సేకరించి రీ సైకిల్ చేయాలి. లేదా వీటికి వాడే పాలి ఎథిలిన్‌కు ప్రత్యామ్నాయంగా చౌకగా లభ్యమయ్యే సురక్షిత ప్యాకింగ్ ఫిల్మ్ కోసం అన్వేషించాలి. డెయిరీ రంగంపై ఇంధన సమస్య ప్రభావాల మీద లోతైన చర్చ అవసరం. కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు, ఇండియన్ డెయిరీ అసోసియేషన్, నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు, ఇతర డెయిరీ కంపెనీల యాజమాన్యాలు ముందుకొచ్చి జాతీయ, ప్రాంతీయ స్థాయి సదస్సులు నిర్వహించాలి. వీలయినంత త్వరగా వీటిని నిర్వహించి నిపుణుల సూచనలు తీసుకుని, వాటిని అమలుచేయాలి. ఇంధన పొదుపు మనందరి తక్షణ కర్తవ్యం.

# మళ్లీ డీలిమిటేషన్ బిల్లు

**మొదటిపేజీ తరువాయి -** నియోజకవర్గాల పునర్విభజన బిల్లును పార్లమెంటు ముందుకు తీసుకువచ్చింది. అయితే ఆ సమయంలో ప్రాంతీయ పార్టీల నుంచి, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఫలితంగా ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై పార్లమెంటులో వ్యతిరేకంగా ఓటు వేయడంతో బిల్లు వీగిపోయింది. దీన్ని దృష్టిలో పెట్టుకునే.. ఈసారి బిల్లును నేరుగా సభలో పెట్టకుండా, ముందుగానే విస్తృత అవగాహన కుదిరిన తర్వాతే తదుపరి అడుగు వేయాలని కేంద్రం భావిస్తోందని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది.

# పవన్ సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదు

**మొదటిపేజీ తరువాయి -** ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా, ఎక్కడైనా సభ పెట్టుకునే హక్కు ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జనసేన సభకు ఎందుకు అనుమతి ఇవ్వలేదని ప్రశ్నించారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఉద్దేశపూర్వకంగానే మళ్లీ తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టాలని చూస్తున్నాయని ఆరోపించారు. ఈ రెండు పార్టీలను ప్రజలు పూర్తిగా తిరస్కరించే పరిస్థితి వచ్చిందని అన్నారు. అందుకే తమ ఉనికిని కాపాడుకోవడానికే మళ్లీ ప్రాంతీయ సెంటిమెంట్‌ను వాడుకుంటున్నాయని మం డిప డ్డారు. గతంలో ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించిన ఎంఐఎంతో బీఆర్ఎస్ కలిసి పనిచే యలేదా? అని ఆయన నిలదీశారు. అది తెలంగాణ వ్యతిరేక శక్తులతో పనిచేసినట్లు అవ్వదా? అంటూ ప్రశ్నించారు.రాజకీయ పరిస్థితులను బట్టి తెలంగాణలో పొత్తుపై ముందుకెళ్తామని రామ చందర్ రావు స్పష్టం చేశారు. జనసేనతో పొత్తుపై పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు.

# చంచల్‌గూడ జైల్లో బాల్క సుమన్‌ను కలిసిన కేటీఆర్

**మొదటిపేజీ తరువాయి -** పరామర్శించిన వారిలో ఉన్నారు. జైల్లో ఉన్న సుమన్‌కు పార్టీ పూర్తి అండగా ఉంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ భరోసా ఇచ్చారు.

**అసలు కేసు నేపథ్యం ఏంటి?**

సింగరేణి కాలరీస్ ఆస్తులను ధ్వంసం చేయాలంటూ, రైలు పట్టాలు కోసేయాలంటూ బాల్క సుమన్ ఇటీవల రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో ఆయనపై నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ తర్వాత ఈ కేసును బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. గడిచిన మే 26న తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన బహిరంగ సభలో బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ.. సింగరేణి కాలరీస్‌కు చెందిన జూనియర్ అసిస్టెంట్ ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ అరెస్ట్ చర్యలు చేపట్టారు.

# ఎట్టకేలకు కేరళను తాకిన రుతుపవనాలు

**మొదటిపేజీ తరువాయి -** ఆలస్యంగా వచ్చాయి. కేరళ తీరంలో వాతావరణం అనుకూలంగా మారడంతో ఇవి దేశంలోకి ప్రవేశించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. నాలుగు నెలల పాటు సాగే వర్షాకాలానికి ఇది ఆరంభం అని చెప్పవచ్చు. ఈ వార్తతో దేశంలోని రైతులు, మార్కెట్ వర్గాలు, ఆర్థిక నిపుణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.భారత్‌లో వ్యవసాయ రంగం ఎక్కువగా వర్షాలపైనే ఆధారపడి సాగుతోంది. మొత్తం సాగవుతున్న భూమిలో దాదాపు 51 శాతం ప్రాంతానికి ఈ రుతుపవన వర్షాలే ప్రధాన ఆధారం. కోట్లాది మంది ప్రజల జీవనోపాధి, గ్రామీణ ప్రాంతాల ఆదాయం ఈ వానలపైనే ఆధారపడి ఉన్నాయి. రుతుపవనాలు సకాలంలో వస్తేనే పంటల దిగుబడి పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలు అదుపులో ఉంటాయి. వర్షాల వల్ల గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, దేశ ఆర్థిక వృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని నిపుణులు భావిస్తున్నారు.కేరళను తాకిన ఈ రుతుపవనాలు రాబోయే రోజుల్లో దశలవారీగా దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరిస్తాయి. జులై మధ్య నాటికి దేశం మొత్తాన్ని కమ్ముకునే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. రాబోయే కొన్ని వారాల పాటు ఇవి ఎంత వేగంగా ముందుకు సాగుతాయనేది చాలా కీలకంగా మారనుంది.

# అమిత్ షాపై వివాదాస్పద వ్యాఖ్యలు

**మొదటిపేజీ తరువాయి -** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై సిలిగురి సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, హోం మంత్రి అమిత్ షాపై ఆమె వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఓ న్యాయవాది ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. జూన్ 2న కోల్‌కతాలో జరిగిన నిరసన సభలో మమతా బెనర్జీ మాట్లాడుతూ.. బంగ్లాదేశ్ జాతీయుడు ఉస్మాన్ హాది హత్య గురించి ప్రస్తావించారు. ఆ హత్య వెనుక కేంద్ర హోం శాఖ ప్రమేయం ఉందనేలా ఆమె సంచలన ఆరోపణలు చేశారు.ఈ వ్యాఖ్యలపై లాయర్ రింకీ సేన్ ఛటర్జీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గత డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌లో ఉస్మాన్ హాది హత్య జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఆ హంతకులు మేఘాలయ సరిహద్దు దాటి బెంగాల్‌లోకి రాగా రాష్ట్ర ఎస్టీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారని గుర్తు చేశారు. అయితే ఈ హత్య కేంద్ర హోం శాఖ ఆదేశాల మేరకే జరిగిందని మమతా బెనర్జీ ఆరోపించడం సరికాదన్నారు. ఇలాంటి వ్యాఖ్యల వల్ల భారత్, బంగ్లాదేశ్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.దీదీ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో ఉండే హిందువుల భద్రతను కూడా ఇవి ప్రమాదంలో పడేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి రెచ్చగొట్టేలా మాట్లాడటం చట్టవిరుద్ధమని అన్నారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# లండన్ ఐ తరహాలో అమరావతిలో 'అమరావతి ఐ'

**మొదటిపేజీ తరువాయి -** ప్రత్యేక స్థానం కల్పిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

**రాజధాని నిర్మాణ పనులకు ఊతం**

అమరావతిలో నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా కేబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంది. హైకోర్టు భవనం బాహ్య సుందరీకరణ పనుల కోసం రూ. 547 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. అదేవిధంగా, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు, ప్రిన్సిపల్ సెక్రటరీల నివాస భవనాల్లో హోమ్ ఆటోమేషన్, ఇతర ఆధునిక సౌకర్యాల కల్పన కోసం రూ. 94.90 కోట్ల పనులకు ఆమోదం తెలిపింది. రాజధానిలో అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం కోసం ఏపీఐఐసీకి ఎనిమిది ఎకరాల భూమి కేటాయింపును నిర్ధారించారు. రానున్న 9-10 నెలల్లో దీని నిర్మాణం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**గ్రామీణ ఉపాధికి 125 రోజుల గ్యారెంటీ**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్' పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. జూలై 1, 2026 నుంచి ఈ పథకం అమలులోకి వస్తుంది. దీని కింద ప్రస్తుతం ఉన్న 100 రోజుల ఉపాధి హామీని 125 రోజులకు పెంచారు. దీనివల్ల ప్రతి గ్రామీణ కుటుంబానికి అదనంగా ఏటా రూ. 7,675 లబ్ధి చేకూరుతుంది. ఈ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు సమకూరుస్తాయి. అంతేకాకుండా, కూలీలకు 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించాలని, ఆలస్యమైతే రోజుకు 0.05% చొప్పున వడ్డీ చెల్లించాలని నిబంధన విధించడం గమనార్హం.

**కొత్త పాలసీలతో ప్రగతి పథం**

విమానయాన పాలసీ: రాష్ట్ర విమానయాన రంగంలో భారీ లక్ష్యాలతో కొత్త పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. 2035 నాటికి ప్యాసింజర్ మార్కెట్ షేర్‌ను 4 శాతానికి, ఎయిర్ కార్గో మార్కెట్ షేర్‌ను 5 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కొత్త విమానాశ్రయాలు, వాటర్ డ్రోమ్‌ల ఏర్పాటు, ఏరోస్పేస్ తయారీలో పెట్టుబడులను ఆకర్షించడం ఈ పాలసీ ముఖ్య ఉద్దేశాలు.బీచ్ షాక్ పాలసీ: రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు గోవా, ఒరిస్సా తరహాలో బీచ్ షాక్‌ల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పైలట్ ప్రాజెక్ట్‌గా తొలి దశలో చీరాలలోని సూర్యలంక, విశాఖపట్నం బీచ్‌లలో రెండేసి చొప్పున షాక్‌లను ఏర్పాటు చేస్తారు.అవయవదాన చట్టం: అవయవదానం, అవయవ మార్పిడి కార్యకలాపాలను నియంత్రించేందుకు కేంద్రం తీసుకొచ్చిన 'ది ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ యాక్ట్-2011'ను రాష్ట్రంలో అమలు చేసేందుకు కేబినెట్ నిర్ణయించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు, అవయవాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఈ చట్టాన్ని ఆర్డినెన్స్ రూపంలో తీసుకురానున్నారు.

**వ్యవసాయం, పరిశ్రమలకు చేయూత**

పోలవరం ఎడమ ప్రధాన కాలువ ప్యాకేజీ 5, 5ూ పనులకు సంబంధించి అంచనా వ్యయాన్ని రూ. 352.6 కోట్ల నుంచి రూ. 796.66 కోట్లకు సవరిస్తూ కేబినెట్ పరిపాలన అనుమతులు ఇచ్చింది. అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టుకు 21 పోస్టులను మంజూరు చేసింది. ఈ కేసుల పరిష్కారానికి మంత్రులతో ఒక సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం నెడ్‌క్యాప్ ద్వారా పలు కంపెనీలకు భూములు లీజుకు ఇచ్చే ప్రతిపాదనలకు కూడా ఆమోదం లభించింది.

**ఇతర కీలక నిర్ణయాలు**

శ్రీ సిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ: తిరుపతి జిల్లా శ్రీ సిటీలో కొత్త ప్రైవేట్ యూనివర్సిటీ ఏర్పాటుకు వీలుగా ఏపీ ప్రైవేట్ యూనివర్సిటీ యాక్ట్-2016 సవరణకు ఆర్డినెన్స్ జారీకి ఆమోదం. అంతర్జాతీయ యోగా దినోత్సవం: జూన్ 7 నుంచి 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు రూ.10 కోట్లు మంజూరు.భూముల రీ-క్లాసిఫికేషన్: గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు గ్రామంలోని 25 ఎకరాల 'ట్యాంక్ పోరంబోకు' భూమిని 'గ్రామ కంఠం'గా మార్చేందుకు నిర్ణయం. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సమస్యలను పరిష్కరించాలని సీఎం ఆదేశించారు.టీడీపీ కార్యాలయాలకు భూమి: అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో తెలుగుదేశం పార్టీ కార్యాలయాల నిర్మాణానికి 66 ఏళ్ల లీజు ప్రాతిపదికన భూమి కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది.మొత్తంమీద, ఈ కేబినెట్ సమావేశం రాజధాని అమరావతి నిర్మాణాన్ని పరుగులు పెట్టించడం, పర్యాటక రంగానికి కొత్త ఊపునివ్వడం, గ్రామీణ ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడం, పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేయడం వంటి బహుముఖ లక్ష్యాలతో సాగింది. ఈ నిర్ణయాలు రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రగతిపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయని ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేస్తోంది.

# శ్రీసిటీలో రైల్వే రోలింగ్ మిల్లు

**మొదటిపేజీ తరువాయి -** చెందిన ప్రముఖ మెటలర్జికల్ హోల్డింగ్ కంపెనీ 'నోవోస్టల్-ఎం' చైర్మన్ ఇవాన్ డెమ్చెంకోతో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో భేటీ అయ్యారు. భారత్‌లో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించి, పలు కీలక ప్రతిపాదనలు ఆయన ముందుంచారు.భారత్‌లో ప్రస్తుతం పారిశ్రామిక వాతావరణం అత్యంత అనుకూలంగా ఉందని లోకేష్ తెలిపారు. పర్యావరణ అనుమతులు వేగంగా లభిస్తున్నాయని, మౌలిక సదుపాయాల మార్కెట్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని వివరించారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకుని, అత్యుత్తమ శ్రేణి రీబార్, వైర్ రాడ్‌లను తయారుచేసే అత్యాధునిక ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేస్ (ఈఏఎఫ్) స్టీల్ ప్లాంట్‌ను భారత్‌లో నిర్మించాలని లోకేష్ విజ్ఞప్తి చేశారు. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో తక్షణ రైల్వే సైడింగ్ కనెక్టివిటీతో కూడిన స్ట్రక్చరల్ సెక్షన్, రైల్వే ట్రాక్ రోలింగ్ మిల్లును ఏర్పాటు చేయాలని కోరారు. చెన్నై-బెంగళూరు పారిశ్రామిక




కారిడార్ పరిధిలోని ఆటోమోటివ్, షిప్‌బిల్డింగ్ పరిశ్రమలకు నేరుగా ముడిసరుకు అందించేందుకు ప్రత్యేకమైన హార్డ్‌వేర్ గాల్వనైజ్డ్ వైర్ ఫ్యాక్టరీని నిర్మించాలని సూచించారు. వీటితో పాటు, ముడి పదార్థాల లాజిస్టిక్స్ హబ్‌ను అభివృద్ధి చేయడానికి జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయాలని, తక్కువ కర్బన ఉక్కు తయారీలో భాగస్వాములు కావాలని ప్రతిపాదించారు.లోకేష్ ప్రతిపాదనలపై నోవోస్టల్-ఎం చైర్మన్ ఇవాన్ డెమ్చెంకో సానుకూలంగా స్పందించారు. తమ సంస్థ ఏటా 2.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేస్తూ, 60కి పైగా దేశాలకు ఎగుమతి చేస్తోందని వివరించారు. తమ మార్కెట్ విస్తరణలో భాగంగా భారతదేశ నిర్మాణ, ఉత్పాదక రంగాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఇప్పటికే జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు ముడిసరుకు అందిస్తున్నామని, ముంబై, చెన్నై వంటి నగరాల్లో పంపిణీ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. మంత్రి లోకేష్ చేసిన ప్రతిపాదనలు ఆకర్షణీయంగా ఉన్నాయని, వాటన్నింటినీ తమ బోర్డుతో చర్చించి, క్షుణ్ణంగా పరిశీలిస్తామని డెమ్చెంకో హామీ ఇచ్చారు. ఈ భేటీతో ఏపీకి మరో భారీ పెట్టుబడి మార్గం సుగమమైనట్లు తెలుస్తోంది.

# సాగునీటి ప్రాజెక్టుల పనులపై ప్రభుత్వం దృష్టి

**మొదటిపేజీ తరువాయి -** జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తూ ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్లు, పంప్ హౌస్‌లను పరిశీలిస్తున్నారు. మధ్యాహ్నం నారాయణ పేట జిల్లా మక్తల్ కు హెలికాప్టర్ ద్వారా చేరుకున్న సీఎం కొడంగల్ - నారాయణపేట ప్రాజెక్టుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం కోయిల్ సాగర్ ప్రాజెక్టు, కృష్ణా, భీమా నదులపై ప్రతిపాదిత బ్రిడ్జి కమ్ బ్యారేజీలు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. పాలమూరు ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా ముఖ్యమంత్రి, మంత్రులు కాట్రావుపల్లిలో ఎత్తిపోతల పథకం, ప్రతిపాదిత బ్యారేజీలపై ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీ వీక్షించారు. సీఎంతో పాటు కర్ణాటక మాజీ మంత్రి బోసురాజు కూడా మక్తల్ చేరుకున్నారు.జోగులాంబ గద్వాల జిల్లాకు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధరూర్ మండలం గుడ్డందొడ్డి హెలిప్యాడ్ చేరుకున్నారు. గుడ్డందొడ్డి రిజర్వాయర్, జవహర్ లాల్ నెహ్రూ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ఫేజ్-1 ను పరిశీలించారు. గుడ్డందొడ్డి రిజర్వాయర్ ప్రస్తుత సామర్థ్యం 1.5 టీఎంసీలు కాగా 15 టీఎంసీలకు పెంచాలని ప్రతిపాదన సాధ్యాసాధ్యాలపై పరిశీలించారు. నెట్టెంపాడు ఫేజ్-1 పంప్ హౌస్ పరిశీలన, ఫొటో ఎగ్జిబిషన్ వీక్షించారు. పాలమూరు ప్రాజెక్టుల పరిస్థితి, నీటి నిల్వ సామర్థ్యంపై వీడియో ప్రదర్శించారు.ఆ తర్వాత హెలికాప్టర్ ద్వారా బయలుదేరి సాయంత్రం 6 గంటలకు నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిలకు చేరుకున్నారు. అక్కడి



మృగవాణి రిసార్ట్ రివర్ ఫ్రంట్ లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కొల్లాపూర్‌లోని సోమశిలలోనే సీఎం బస చేయనున్నారు.నేడు కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు పంప్ హౌస్‌కు సీఎం చేరుకుంటారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని ప్యాకేజీ-3 హెడ్ రెగ్యులేటర్ ప్యాకేజీ-2 నార్లాపూర్ రిజర్వాయర్ ప్యాకేజీ-1 డెలివరీ సిస్టర్న్, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం లిఫ్ట్-1 పంప్ హౌస్‌లను పరిశీలిస్తారు. నాగర్ కర్నూల్ జిల్లా వట్టెం రిజర్వాయర్ పరిశీలన అనంతరం మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని కొత్తూరు హెలిప్యాడ్ కు చేరుకుంటారు. అనంతరం పీఆర్ఎల్ఐలోని కరివెన రిజర్వాయర్ ప్యాకేజీ-14, 15 పనులను పరిశీలిస్తారు. జడ్చర్ల మండలం ఉద్దండాపూర్ హెలిప్యాడ్ కు చేరుకుంటారు. అక్కడ ప్యాకేజీ 17, 18 పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుంటారు. అనంతరం జడ్చర్లలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.

# దమ్ముంటే నన్ను అరెస్ట్ చేయండి



**మొదటిపేజీ తరువాయి -** సీఎం చంద్రబాబు, మంత్రులు అనిత, కొల్లు రవీంద్రలను టార్గెట్ చేస్తూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ అవగాహన సదస్సులో మాట్లాడిన ఆయన.. ప్రభుత్వానికి ఒక సవాల్ విసిరారు."నేను బియ్యం దొంగతనం చేశానని నాపై ఆరోపణలు చేస్తున్నారు. మీకు నిజంగా ధైర్యముంటే, నాపై విచారణ జరిపించి నన్ను జైల్లో పెట్టండి. 2029 నాటికి చంద్రబాబు ప్రభుత్వం కచ్చితంగా పడిపోతుంది. అంతవరకు మీకు చేతనైతే, దమ్ముంటే నన్ను అరెస్ట్ చేయండి" అంటూ పేర్ని నాని సంచలన వ్యాఖ్యలు చేశారు.స్పోర్ట్స్ కోటా నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని పేర్ని నాని ఆరోపించారు. ప్రభుత్వం మొదట క్రీడా కోటాను 3 శాతానికి పెంచుతూ జీవో ఇచ్చిందని, ఆ తర్వాత 382 మంది ఎంపికయ్యారని చెప్పిందని.. కానీ ఇటీవలే ఆటల సంఖ్యను 29 నుంచి ఏకంగా 67 కి పెంచి, అందులో 'బ్రిడ్జ్' (పేకాట) ను కూడా చేర్చారని విమర్శించారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను గత 9 నెలలుగా ఎందుకు బహిరంగపరచడం లేదు? ఐఏఎస్ అధికారి సంతకం కూడా లేకుండా ఆ లిస్ట్‌ను ఎలా విడుదల చేశారు.ఇప్పుడు కార్డు గేమ్స్ (పేకాట) ఆడేవారిని ఎంపిక చేయలేదని ప్రభుత్వం ఎందుకు మాట మారుస్తోంది? అని ప్రశ్నించారు.డీఎస్సీ నియామకాల్లో జరిగిన భారీ అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికే కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడానికి హోంమంత్రి అనితను ఒక కవచంలా వాడుకుంటోందని పేర్ని నాని మండిపడ్డారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అరాచకాలపై నోరు మెదపని ప్రభుత్వం.. ప్రతిపక్షాలు డీఎస్సీ స్కామ్‌ను లేవనెత్తినప్పుడు మాత్రం హైపర్‌యాక్టివ్‌గా మారుతోందని ధ్వజమెత్తారు. డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో జరిగిన 'పాపాలు' చంద్రబాబును, ఆయన మంత్రులను వదిలిపెట్టవని పేర్ని నాని హెచ్చరించారు.

# 50 నుంచి 100 శాతం భూముల విలువ పెంపు



**మొదటిపేజీ తరువాయి -**దఅంచనా వేస్తున్నట్టు తెలిపారు. తెలంగాణలో భూముల మార్కెట్ విలువలను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. జూన్ 5వ తేదీ నుంచి సవరించిన కొత్త రేట్లు అమల్లోకి రానున్నాయి.ఈ నేపథ్యంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ, వాస్తవ మార్కెట్ ధరలకు అనుగుణంగా ప్రభుత్వ విలువలను సవరించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. ముఖ్యంగా అధిక డిమాండ్ ఉండే శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, ఖాజాగూడ వంటి ప్రాంతాల్లో పెంపు ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. అయితే, రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచే ఆలోచన లేదని మంత్రి స్పష్టం చేశారు.అదే సమయంలో, పరిపాలనలో పారదర్శకత పెంచేందుకు సబ్-రిజిస్ట్రార్ల అధికారాలను గణనీయంగా తగ్గించినట్టు తెలిపారు. కొత్త రేట్లపై ప్రజల సందేహాలు, ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా ఒక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయనున్నట్టు హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగాయని అన్నారు. తమ ప్రభుత్వం వాటిని నిషేధిత జాబితాలో పెట్టిందని అన్నారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం గురించి కూడా మంత్రి మాట్లాడారు. ఈ పథకం కోసం ఇప్పటివరకు రూ.7,000 కోట్లు విడుదల చేశామని, ఒకవేళ కేంద్రం నుంచి నిధులు రాకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే బిల్లులు చెల్లించి ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తుందని భరోసా ఇచ్చారు.

ప్రజా మంటలు
శుక్రవారం 05 - 06 - 2026

# ఇదెకరాల ప్రభుత్వ భూమి కబ్జా.....?

**అసైన్ మెంట్ కమిటీ ఆమోదం లేదని ఆరోపణ**

**సర్పంచ్ భర్త, మరిదిపై జిల్లా కలెక్టర్ కు పిర్యాదు**

**వెంటనే భూమిని స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి**


**ప్రభుత్వ అవసరాలకు ఈ భూమి**

**ఉపయోగించాలని పిర్యాదు దారుని డిమాండ్**

**యాభై ఏండ్లుగా మా స్వాధీనంలోనే ఉందని**

**వివరణ ఇచ్చిన సర్పంచ్ భర్త**







**(- చుక్క గంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ ) :** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం చిన్నాపూర్ శివారులో జాతీయ రహదారిని ఆనుకొని ఐదెకరాల ప్రభుత్వ భూమిని సర్పంచ్ భర్త, ఆమె మరిది కబ్జా చేశారని ఆరోపిస్తూ అదే గ్రామానికి చెందిన సల్లూరి తిరుపతి గురువారం జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేశారు. అందరి కండ్ల ముందే అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూమి కబ్జా కు గురైనా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి.ఒకే కుటుంబంఏళ్ల తరబడి ఈ భూమిని అనుభవిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.జిల్లా కలెక్టర్ కు సల్లూరి తిరుపతి చేసిన లిఖిత పూర్వక పిర్యాదు ప్రకారం పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.చిన్నాపూర్ గ్రామ శివారు సర్వే నంబర్ 23, 70 లలో అత్యంత ఖరీదైన ( విలువైన) సుమారు 5 ఎకరాల సర్కార్ భూమిని సర్పంచ్ భర్త గట్టు గంగారాం, ఆయన సోదరుడు గట్టు గంగాధర్ అనే ఇద్దరు వ్యక్తులు అసైన్మెంట్ కమిటీ ఆమోదం లేకుండా, తహసీల్దార్ ను తప్పుదోవ పట్టించి ప్రభుత్వ భూమిని అక్రమంగా భూ - రికార్డులలో వారి పేర్లు నమోదు చేసుకున్నారు. గత కొన్నేళ్లుగా సాగు చేసుకుంటూ కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రధానమంత్రి కిసాన్ యోజన, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రైతు భరోసా, రుణ మాఫీ, భారీగా ఋణ ప్రయోజనం పొందుతున్నారని గ్రామస్థుల ఆరోపణ.ఎలాంటి హక్కులు లేకుండా దొంగ చాటుగా పేర్లు నమోదు చేసుకొని భూమిని ఆక్రమించి పంటలు వేసుకుంటున్నారని వినతి పత్రంలో సల్లూరి తిరుపతి ఆరోపించారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ భూమికి మంచి డిమాండ్ ఉంటుందని స్థానికులు చెబుతున్నారని తిరుపతి వివరించారు.కబ్జాకు గురైన భూమిని తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం ఈ భూమిని వాడాలని తిరుపతి డిమాండ్ చేశారు. శాంతిభద్రతల కోసం బుగ్గారం మండల పోలీస్ స్టేషన్ సొంత భవనం నిర్మాణానికి ఈ స్థలం కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు యువత క్రీడల్లో రాణించేందుకు క్రీడా ప్రాంగణం నిర్మాణం చేపట్టాలని కోరారు. బుగ్గారం మండలంకు సంబందించిన పాత్రికేయులకు ఇళ్ల స్థలాల కోసం ఈ భూమిని ఇప్పించాలని సల్లూరి తిరుపతి కలెక్టర్ కు ఇచ్చిన వినతి పత్రంలో కోరారు.రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యం వల్లే కబ్జాదారులు చెలరేగిపోతున్నారని, వెంటనే విచారణ జరిపి అక్రమ హక్కులను రద్దు చేయాలని ఆయన కలెక్టర్‌ను కోరారు. తహసీల్దార్‌కు ఆదేశాలు ఇచ్చి భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆయన పట్టుబట్టారు. అయితే ఇట్టి భూమిని క్రయ, విక్రయాలు, విరాసత్, జమాబాంది కాకుండా చూడాలని తిరుపతి కోరారు.ఈ ఫిర్యాదుతో బుగ్గారం రెవెన్యూ వర్గాల్లో గురువారం కలకలం రేగింది.యాభై ఏండ్లుగా ఈ భూమి మా స్వాధీనంలోనే ఉంది- సర్పంచ్ భర్త గట్టు గంగారాం భూ కబ్జా ఆరోపణలు ఎదుర్కొంటున్న చిన్నాపూర్ గ్రామ సర్పంచ్ భర్త గట్టు గంగారాం ను ఫోన్ కాల్ చేసి వివరణ కోరగా ఈ భూమి గత యాభై ఏళ్లుగా మా కుటుంబ స్వాధీనంలోనే ఉందన్నారు. మా తాత - మాతండ్రి అప్పటి నుండి ఈ భూమిని మా కుటుంబమే సాగు చేసుకోవడం జరుగుతుందన్నారు. కావాలనే రాజకీయ కుట్రలతో మాపై తప్పుడు ఆరోపణలతో పిర్యాదులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మా చిన్నాపూర్ గ్రామ శివారులో ఉన్న రైతులందరి వ్యవసాయ భూములు అన్నీ కూడా ప్రభుత్వ పరంగా రెవెన్యూ భూములేనని ఆయన చెప్పుకొచ్చారు. సర్పంచ్ గా తన భార్య గెలుపొంది ఇతరుల ఓడిపోయినందున రాజకీయంగా కుట్రలు చేసి అనవసరంగా మాపై నిందెలు మోపుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన వివరించారు. తాను గానీ, తన సోదరుడు గట్టు గంగాధర్ గానీ ఎలాంటి ప్రభుత్వ భూమిని కబ్జా చేయలేదని అన్నారు. ప్రస్తుతం తప్పుడు ఆరోపణలతో పిర్యాదు చేసిన సర్వే నం. 23, 70 లలో మేము సాగు చేసుకుంటున్న భూమి అంతా కూడా గతంలో మా తాత - మాతండ్రి స్వాధీనంలో సాగు చేసుకున్న భూమేనని ఆయన తెలియ జేశారు.

# జగిత్యాల జిల్లాలో వరుస దొంగతనాలు

**టి-ఫైబర్ పరికరాలే దొంగల లక్ష్యం**

**కేసును ఛేదించిన జగిత్యాల రూరల్ పోలీసులు**

**ముగ్గురు నిందితుల అరెస్ట్ - రిమాండ్**

**రూ.4.52 లక్షల సొత్తు రికవరీ...**

**విలువైన 39 బ్యాటరీలు, 4 యూపీఎస్‌లు, ఒక**

**బజాజ్ ఆటో స్వాధీనం**



**( - చుక్క గంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ - జగిత్యాల ) :** జగిత్యాల జిల్లాలో గత కొంతకాలంగా గ్రామ పంచాయతీ భవనాల్లో ఏర్పాటు చేసిన టి-ఫైబర్ పరికరాలను లక్ష్యంగా చేసుకుని దొంగ తనాలు జోరుగా సాగుతున్నాయి.వరుస దొంగతనాల కేసులను జగిత్యాల రూరల్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులలో నిందితులుగాలక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బండ అంజయ్య (36),మండలి రవి (49), చెమేల్ల నరేష్ (38) లను గుర్తించి ఈ ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి గురువారం రిమాండ్ కు తరలించారు. నిందితుల నుండి సుమారు రూ.4.52 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు జగిత్యాల రూరల్ సి.ఐ సుధాకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల దర్యాప్తులో భాగంగా గురువారం ఉదయం ధరూర్ గ్రామ శివారులోని జగిత్యాల బైపాస్ రోడ్డుపై అంబేద్కర్ విగ్రహం సమీపంలో పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా వెళ్తున్న టిజి 21 టి 1774 నంబరు గల ఆటో రిక్షాను తనిఖీ చేసారు. అందులో భారీ సంఖ్యలో బ్యాటరీలు, యూపీఎస్ పరికరాలు లభ్యమయ్యాయి. వెంటనే ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. టి-ఫైబర్ పరికరాల దొంగతనాలకు పాల్పడినట్లు ఆ ముగ్గురు అంగీకరించారు.పోలీసుల విచారణలో ప్రధాన నిందితుడు బండ అంజయ్య గతంలో టి-ఫైబర్‌కు అనుబంధ సంస్థ అయిన స్టెర్‌లైట్ టెక్నాలజీస్ లిమిటెడ్‌లో డ్రైవర్‌గా, అనంతరం టెక్నీషియన్‌గా పనిచేసినట్లు వెల్లడైంది. ఉద్యోగం మానేసిన అనంతరం గ్రామపంచాయతీ భవనాల్లోని టి-ఫైబర్ బ్యాటరీలు, యూపీఎస్‌లను దొంగిలించాలనే పథకాన్ని రూపొందించి, తన సహచరులు మండలి రవి, చెమేల్ల నరేష్‌లకు తెలిపాడు. ముగ్గురు కలిసి గత నెల రోజులుగా ధర్మారం, లక్ష్మీపూర్, తిమ్మాపూర్, కల్లెడ, సంగంపల్లి, హన్మాజీపేట, అనంతారం, గుట్రాజ్‌పల్లి, అంతర్గాం, గొల్లపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన టి-ఫైబర్ పరికరాలను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడ్డారు.దొంగిలించిన బ్యాటరీలు, యూపీఎస్‌లను ఆటోలో తరలించి ఒకచోట నిల్వ చేసి, విక్రయించేందుకు తీసుకెళ్తున్న సమయంలో పట్టుకున్నట్లు జగిత్యాల రూరల్ సిఐ సుధాకర్ తెలిపారు.

# దళితుల భూములను లాక్కోవడం సరికాదు

**జాతీయ ఎస్సీ కమిషన్‌కు మోత్కుపల్లి వినతి**



**సికింద్రాబాద్, జూన్ 04 ( ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్రంలో గత మరియు ప్రస్తుత ప్రభుత్వాలు దళితుల అసైన్డ్ భూములను బలవంతంగా వెనక్కి తీసుకుంటూ వారికి తీవ్ర అన్యాయం చేస్తున్నాయని మాజీ మంత్రి, మాదిగ మహాశక్తి వ్యవస్థాపక అధ్యక్షులు మోత్కుపల్లి నరసింహులు ఆవేదన వ్యక్తం చేశారు. కవాడిగూడలోని సీజీఓ టవర్స్‌లో ఉన్న జాతీయ షెడ్యూల్ కులాల (ఎస్సీ) కమిషన్ డైరెక్టర్‌ను ఆయన గురువారం కలిసి ఈ మేరకు ఒక వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా దళితుల భూములను లాక్కుంటున్న ఉదంతాలపై కమిషన్ తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా మోత్కుపల్లి నరసింహులు మీడియాతో మాట్లాడుతూ... గతంలో సాగుకు పనికిరాని గుట్టలు, చెట్లు, వంపలతో కూడిన నిరుపయోగమైన భూములను అప్పటి ప్రభుత్వాలు దళితులకు, మాల మాదిగలకు కేటాయించాయని గుర్తు చేశారు. ఆ భూములను దళిత లబ్ధిదారులు ఎంతో కష్టపడి, చెట్లను నరికి, గుట్టలను తొలగించి సాగు యోగ్యంగా మార్చుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అయితే ప్రస్తుతం భూముల ధరలు విపరీతంగా పెరగడంతో ప్రభుత్వ పెద్దలు, బడా భూస్వాములు, కాంట్రాక్టర్ల కన్ను ఈ భూములపై పడిందని మండిపడ్డారు. పేద దళితుల నుంచి ఆ భూములను తిరిగి వాపస్ తీసుకొని బడా కాంట్రాక్టర్లకు కట్టబెడుతూ సొమ్ము చేసుకుంటున్నారని, ఈ చర్యను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు.ఇటీవల తాము బండరావిరాల గ్రామాన్ని సందర్శించినప్పుడు అక్కడి దళితుల పరిస్థితి అత్యంత దయనీయంగా కనిపించిందని మోత్కుపల్లి పేర్కొన్నారు. సుమారు 50 ఏళ్ల క్రితం అక్కడ 72 మంది దళిత లబ్ధిదారులకు 135 ఎకరాల భూమిని ఇచ్చారని, వారు దాన్ని బ్రహ్మాండంగా సాగు చేసుకుంటున్న తరుణంలో ప్రభుత్వం ఆ భూమి మొత్తాన్ని వెనక్కి తీసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ భూములకు సంబంధించి రూ. 10 కోట్ల పరిహారం (కంపెన్సేషన్) ఇస్తామని ప్రభుత్వమే స్వయంగా జీవో విడుదల చేసినప్పటికీ, ఇప్పటివరకు నయాపైసా పరిహారం అందించకపోవడం దారుణమన్నారు.రాష్ట్రవ్యాప్తంగా దళితుల భూములను లాక్కోవడం, పరిహారం ఇవ్వకుండా వేధించడం నిత్యకృత్యంగా మారిందని ఆరోపించారు. ప్రభుత్వానికి భూములు అవసరమైతే ఇతర ప్రభుత్వ భూములను వాడుకోవాలని లేదా ప్రైవేట్ భూములను కొనుగోలు చేయాలి తప్ప, కేవలం దళితుల భూములనే ఎందుకు టార్గెట్ చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ భూ దోపిడీపై జాతీయ ఎస్సీ కమిషన్ సమగ్ర విచారణ జరిపి దళితులకు న్యాయం చేయాలని మోత్కుపల్లి నరసింహులు డిమాండ్ చేశారు.

# రైతు భరోసా కనుమరుగవుతోంది

**కానరాని పంట రుణాల కార్యాచరణ**

**విలేఖరుల సమావేశంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి**



**( - చుక్క గంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ - జగిత్యాల):** తెలంగాణ రాష్ట్రంలో రైతు భరోసా కనుమరుగైనట్టు కనబడుతుందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి ఆరోపించారు.జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలో గురువారం ఆయన పత్రిక విలేఖరుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జీవన్ రెడ్డి మాట్లాడుతూ పంట రుణాలకు సంబంధించి తగు కార్యాచరణ కనబడుట లేదన్నారు. కనీసం ఖరీఫ్లోనైనా రైతు భరోసా కల్పించాలని ఆయన కోరారు.ధాన్యం సేకరణలో రైతులు ఇబ్బందులు పడుతున్న సంగతి అందరికీ తెలిసిందే నన్నారు.కాంగ్రెస్, బీజేపీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు తప్ప సమన్వయంతో రైతు గురించి ఆలోచన చేయడం లేదన్నారు. ప్రత్యామ్నాయంగా పప్పు దినుసులు, నూనె గింజలు పండించాలని సలహా ఇచ్చినట్టు గమనించామన్నారు. పప్పు దినుసులకు నూనె గింజలకు ఏ విధమైన ప్రోత్సాహం ప్రభుత్వం కల్పించబోతున్నదో చెప్పండని ఆయన కోరారు. ఒక ఎకరానికి వరి సాగులో పెట్టుబడి పోగా 25 వేల వరకు మిగులుతాయి మొక్క జొన్నలో 30 వేల వరకు మిగులుతాయన్నారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా రైతు ఆయన పామాయిల్ పెట్టుకుంటే అతనికి కోతుల బెడద లేకపోవచ్చు కానీ మాకు ఆర్తడి పంటలకు కోతుల బెడద ఎక్కడైనా ఉందన్నారు.కోతులకు పునరుత్పత్తి నిలుపుదల కేంద్రాన్ని జిల్లాకు ఒకటి ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.తక్షణమే రైతుకు సోలార్ ఫెన్సింగ్ 50% రాయితీతో ఇవ్వాలన్నారు.విత్తన రాయితీ కూడా కనుమరుగయిందన్నారు. ఆరుతడి పంటలకు ప్రత్యామ్నాయంగా కావాలంటే రైతులకు విత్తనాలు 50% రాయితీతో ఇవ్వండని తెలిపారు. రైతులను రసాయనిక ఎరువుల నుండి సేంద్రీయ ఎరువుల వైపు మళ్ళించాలని భావిస్తున్నాం కానీ పచ్చిరొట్ట, జనుము, జీలుగు విత్తనాల భారం ఎకరానికి 2000 వరకు పడుతుందన్నారు. వరి ధాన్యానికి సన్న రకాలకు క్వింటాల్ కు 500 బోనస్ ఇస్తా అన్నారు అంటే ఎకరాన 20 క్వింటాళ్ల కు 10,000 వరకు బోనసిస్తున్నారు, అలాగే పప్పు దినుసులకు కూడా ప్రోత్సాహం కల్పించాలన్నారు. ఎందుకంటే పప్పు దినుసులు ఎకరానికి 5 క్వింటాళ్లకి మించి పండవని ఆయన వివరించారు. పప్పు దినుసులు పండించాలంటే ప్రధానంగా కోతుల బెడద ఉండడం, గిట్టుబాటు ధర లేకపోవడం అన్నారు. జనుము, జీలుగు విత్తనాలు ఉచితంగా ఇచ్చిన తప్పులేదు గత సంవత్సరం కిలో 40 రూపాయలు ఉంటే ఇప్పుడు 80 రూపాయలు అయిందన్నారు. అసలు ఈ విషయం ముఖ్యమంత్రికి,వ్యవసాయ శాఖ మంత్రికి తెలుసో .. లేదో.... నాకైతే తెలియదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయి మూడు సంవత్సరాలు అయినప్పటికీ ఆరు పంటలు పండాయి ఇందులో ఎన్ని పంటలకు రైతు భరోసా కల్పించారో ఆయన ఆత్మకే తెలుసు అన్నారు.ఈ కార్యక్రమంలో యువజన నాయకుడు తాటిపర్తి సి.కె. రెడ్డి. గోపి రాజిరెడ్డి, బార్కం మల్లేశం, కొయ్యేడి మహిపాల్, ఉదయశ్రీ, శ్రీధర్ రెడ్డి, రాకేష్, గుమ్మడి సంతోష్ , బత్తిని భూమన్న, నగరాజ్ , రాజేందర్ గౌడ్, వల్లకొండ మహేష్ , పొన్నం శ్రీకాంత్, హరీష్ రావు, మంద రమేష్, రాజీవ్, రవి, సాయి, సత్యనారాయణ, మహేందర్, కలీల్, జక్కుల రవి, మంజూరు వివిధ హోదాలో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

# ఈ.వీ.ఎం. గోదాము తనిఖీ చేసి

**భద్రత ఏర్పాట్లు, సిసి కెమెరాల పనితీరులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**జగిత్యాల, జూన్ 4(ప్రజా మంటలు) :** రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు సాధారణ తనిఖీ లో భాగంగా గురువారం రోజున జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ దరూర్ క్యాంప్ లో గల ఈ.వీ.ఎం. లను భద్రపరిచిన గోదామును రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూప్రతినెల ఈ.వీ.ఎం లను తనిఖీ చేయడం జరుగుతుందని గోడౌన్ లోని యంత్రాల భద్రత, సి.సి. కెమెరాల పనితీరు, సాంకేతికపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించడం జరిగిందని తెలిపారు.గోదాము వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన భద్రత ఉండాలని, నిత్యం అప్రమత్తత తో పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు.ఈ పర్యవేక్షణలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల అర్బన్ ఎమ్మార్వో రామ్మోహన్, రాజకీయ పార్టీ ప్రతినిధులు మరియ తదితరులు పాల్గొన్నారు.

# కొడిమ్యాల ఫారెస్ట్ కార్యాలయంలో ఏసీబీ దాడులు



**జగిత్యాల జూన్ 4 ( ప్రజా మంటలు) :** రూ.80 వేల రూపాయల లంచం తీసుకుంటూ ఎఫ్ఆర్ఓ మొయినొద్దీన్ ఏ సి బి అధికారులకు పట్టుబడ్డారు.జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని ఫారెస్ట్ కార్యాలయంలో గురువారం ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.80 వేల లంచం తీసుకుంటుండగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) మొయినొద్దీన్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం. పక్కా సమాచారంతో వల పన్నిన ఏసీబీ అధికారులు, లంచం స్వీకరిస్తున్న సమయంలోనే అధికారిని అదుపులోకి తీసుకున్నారు. కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి సంబంధిత పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనతో కొడిమ్యాల ఫారెస్ట్ శాఖలో కలకలం రేగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# భీమదేవరపల్లిలో బెల్ట్ షాపులపై సర్పంచ్ కుమారస్వామి ఉక్కుపాదం









**భీమదేవరపల్లి జూన్ 4 ( ప్రజా మంటలు):-** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి గ్రామాన్ని మద్యం రహితంగా మార్చేందుకు సర్పంచ్ మాచర్ల కుమారస్వామి కఠినంగా వ్యవహరించారు.బెల్ట్ షాపుల బంద్‌కు కొనసాగింపుగా గురువారం సర్పంచ్ కుమారస్వామి ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ శనిగరం అయిలయ్య, వార్డు సభ్యులు, గ్రామ సిబ్బంది గ్రామంలోని బెల్ట్ షాపులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వాటి వద్ద బ్యాలెన్స్‌గా ఉన్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు తరలించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా మళ్లీ బెల్ట్ షాపులు నిర్వహిస్తే రూ.10 వేల జరిమానా విధించడంతో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం మహమ్మారిని గ్రామం నుంచి పూర్తిగా తరిమికొట్టేందుకు పంచాయతీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.గ్రామ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మద్యం వ్యసనానికి దూరంగా ఉండాలని, ఎవరైనా అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సర్పంచ్‌కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు..

# బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో డైరీ యూనిట్ ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ

**ఈ నెల 11లోగా దరఖాస్తుల స్వీకరణ - ఎంపీడీవో వీరేశం**




**భీమదేవరపల్లి జూన్ 4 ప్రజా మంటలు:-** బీసీల ఆర్థిక సాధికారత కోసం బీసీ కార్పొరేషన్ పైలెట్ ప్రాజెక్టు కింద డైరీ యూనిట్ల ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు భీమదేవరపల్లి ఎంపీడీవో వీరేశం వెల్లడించారు.ఈ పథకం కింద అర్హులైన బీసీ లబ్ధిదారులు డైరీ యూనిట్ ఏర్పాటు చేసుకునేందుకు బీసీ కార్పొరేషన్ నుంచి ఆర్థిక సహాయం పొందవచ్చు. ఈ పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.ఆసక్తి ఉన్న అభ్యర్థులు నిర్ణీత దరఖాస్తు ఫారంలో వివరాలు పూర్తి చేసి, కుల ధృవీకరణ పత్రం, ఆధార్, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ తదితర పత్రాలతో సహా ఈ నెల 11వ తేదీలోపు మండల పరిషత్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు..

# ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక

**గ్రామసభల్లో పోలీసుల అవగాహన సదస్సులు**

**రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలనపై ప్రజలకు సూచనలు**



**( - చుక్క గంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ - జగిత్యాల) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన గ్రామసభల్లో పోలీసు అధికారులు ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ శాఖల సమన్వయంతో నిర్వహించిన ఈ గ్రామసభల్లో పోలీస్ అధికారులు ప్రజలతో నేరుగా మమేకమై ప్రజల భద్రత, యువత భవిష్యత్తు కు సంబంధించిన పలు అంశాలను వివరిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా నిర్వహిస్తున్న “అరైవ్ అలైవ్” రోడ్డు భద్రతా ప్రచారం గురించి గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ వినియోగించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచిస్తున్నారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగించడం ప్రమాదాలకు కారణమవుతాయని హెచ్చరించారు. అదేవిధంగా యువతను మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడడం సమాజం మొత్తం బాధ్యత అని పేర్కొన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. గ్రామాల్లో ఎక్కడైనా గంజాయి విక్రయాలు, రవాణా లేదా వినియోగం జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, ఏటీఎం పిన్ నంబర్లు, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని హెచ్చరించారు. ఫేక్ కాల్స్, సందేశాలు, సోషల్ మీడియా లింకులు, ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రత, బాల్య వివాహాల నిర్మూలన, మహిళలపై వేధింపుల నివారణ, ప్రజా ఆస్తుల పరిరక్షణ, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల పాత్ర వంటి అంశాలపై కూడా అవగాహన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించి ప్రజలను ఆకట్టుకుంటున్నారు.

# రాష్ట్రంలో చెత్త సేకరణకు ఇకపై కొత్త విధానం

**నాలుగు బిన్ లలో చెత్త సేకరణ ఏర్పాట్లు**

**ఈ నెల 7 నుంచి అమలుకు సన్నాహాలు**

**ఘన వ్యర్థాల నిర్వహణ-2026 విధానం**

**అన్నీ రాష్ట్రాలు పాటించాలని మార్గదర్శకాలు**

**చెత్త సేకరణకు కేంద్రం కొత్త విధానం**



సాధారణంగా వంటింట్లో నిత్యం ఎంతో కొంత చెత్త జమ అవుతూనే ఉంటుంది. అలాగే బయటి నుంచి తెచ్చుకునే ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు కూడా ఉంటాయి. వీటన్నింటిని కలిపి ఒకే చెత్తబుట్టలో వేస్తుంటాం. దీంతో వాటి నుంచి దుర్వాసన వస్తుంది. ఆరోగ్యానికి హాని కలుగుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఘన వ్యర్థాల నిర్వాహణ-2026 అనే కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో చెత్తను రకాలుగా విభజించి వేరు చేసేలా ప్రణాళికలు రూపొందంచారు.రాష్ట్రప్రభుత్వం అమలులోకి : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఘన వ్యర్థాల నిర్వహణ-2026 విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆచరణలోకి తీసుకొచ్చేందుకు పూనుకుంది. దీని కోసం రాష్ట్రంలోని నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో ఇంటింటికీ నాలుగు డస్ట్ బిన్‌లను అందించేలా ఏర్పాటు చేసింది. ఆ విధానం ప్రకారం అపార్ట్ మెంట్లు, ఆయా ఇళ్ల వద్ద వ్యర్థాలను నాలుగు రకాలుగా వేరుచేసి పంచాయతీ, పురపాలక పారిశుధ్య సిబ్బందికి అందజేయాల్సి ఉంటుంది.అవగాహన కల్పించేందుకు కార్యాచరణ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కొత్త విధానాన్ని ఏప్రిల్ నుంచి అమలులోకి తీసుకురావాలని అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. దాని ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పురపాలక, గ్రామీణాభివృద్ధి శాఖకు ఆదేశాలు జారీ చేసింది. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా పంచాయతీరాజ్ శాఖ గురువారం నుంచే 'చెత్త వేరు చేస్తే-ఆరోగ్యం, పర్యావరణం సురక్షితం', మన ఊరు-మన బాధ్యత-మన భవిష్యత్తు' పేరిట గ్రామసభలు నిర్వహించి కొత్త విధానంపై అవగాహన కల్పించేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది.జూన్ 7 నుంచి అధికారికంగా ప్రారంభం : ఈ విధానాన్ని ఈ నెల 7న పురపాలకశాఖఅధికారికంగా ప్రారంభించనుంది. దీంట్లో భాగంగా ప్రతి ఇంటికీ నాలుగు బిన్‌లను పంపిణీ చేయనుంది. వీటిలో ఆకుపచ్చ బిన్, నీలం బిన్, ఎరుపు బిన్, నలుపు బిన్ కలర్లు ఉన్నాయి. అయితే ఈ నాలుగు బిన్ లలో వేరు వేరు చెత్తను సేకరించేలా ఏర్పాటు చేశారు.ఆకుపచ్చ బిన్ : దీనిని కేవలం తడి చెత్తను సేకరించటానికి మాత్రమే వాడతారు. దీంట్లో వంటింటి వ్యర్థాలు, కూరగాయల తొక్కలు, ఆహారం, పూలు, టీ, కాఫీ పొడులు వంటివి వేస్తారు. వీటిని కంపోస్ట్, బయోగ్యాస్ తయారు చేయటానికి ఉపయోగిస్తారు.నీలం బిన్ : ఈ బిన్?ను పొడి చెత్తను సేకరించడానికి వాడతారు. దీంట్లో ప్లాస్టిక్, కాగితం, గాజు, లోహ పదార్థాలను వేస్తారు. వీటిని రీస్లైకింగ్ కోసం పంపిస్తారు.ఎరుపు బిన్? : వీటిని శానిటరీ ప్యాడ్లు, డైపర్లు, వైద్య చికిత్సకు వాడిన వస్తువులను సేకరిస్తారు. ఆ తర్వాత వీటిని పేపం ~తో కప్పి బిన్ లో వేయాలి. వీటిని సురక్షితంగా నాశనం చేస్తారు.నలుపు బిన్ : రసాయనాలు లేదా హానికర వ్యర్థాలైన బల్బులు, బ్యాటరీలు, మందులు, ఈ-వేస్ట్, పంచర్ స్ప్రేలు, పెయింట్లు వంటి వాటిని సేకరిస్తారు. ఆ తర్వాత వీటిని ప్రత్యేకవిధానంలోపారబోస్తారు .నిబంధ నలు పాటించని వారిపై చర్యలు : ప్రభుత్వం తెలిపినట్టుగా ఈ నాలుగు బుట్టలను తప్పనిసరిగా వాడాలి. అలాగే వీటిని ఇంటి వద్ద మాత్రమే వేరు చేయాలి. అలా వేరు చేసిన చెత్తనే సిబ్బంది తీసుకుంటారు. ఈ ప్రక్రియ తప్పనిసరి అని అధికారులు చెబుతున్నారు. దీని ద్వారా పర్యావరణానికి మేలు కలుగుతుందంటూ అవగాహన కల్పిస్తున్నారు. ఒకవేళ ఎవరైనా ఈ నిబంధనలను పాటించకుండా ఉంటే వారికి జరిమానా వేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.

# మాజీ అదనపు ఎస్పీ భుజంగరావుకు 14 రోజుల రిమాండ్

**చంచల్ గూడ జైలుకు తరలింపు**

**ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడు భుజంగరావు అరెస్ట్**

**- భుజంగరావును ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచిన ఏసీబీ అధికారులు**

**14 రోజులు రిమాండ్ విధించిన ఏసీబీ కోర్టు**



ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడు ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న అదనపు ఎస్పీ నాయిని భుజంగరావు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలకు చిక్కాడు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ బృందాలు బుధవారం తెల్లవారుజామునే హైదరాబాద్? మియాపూర్ హఫీజ్‌పేట సాయిరాం టవర్స్?లోని ఆయన నివాసంలో సోదాలు నిర్వహించాయి. వనస్థలిపురం ప్రశాంతనగర్?లో ఆయనకు చెందిన మరో ఇంటితోపాటు సూర్యాపేట, సంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లోని ఆయన బంధువులు, బినామీల ఇళ్లలో 15 చోట్ల ఏకకాలంలో సోదాలు జరిగాయి. ఈ తనిఖీల్లో పెద్ద ఎత్తున ఆస్తులను గుర్తించారు. హఫీజ్‌పేటలోని ఫ్లాట్‌లో 29 మద్యం సీసాలు ఉండటంతో ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించారు.తాజాగా భుజంగరావును ఏసీబీ ప్రత్యేక కోర్టులో అధికారులు హాజరుపరుచగా, కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాలతో చంచల్‌గూడ జైలుకు తరలించారు.రెండేళ్ల క్రితమే అరెస్ట్ - బెయిల్‌పై విడుదల : ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో భుజంగరావు సుమారు రెండు సంవత్సరాల క్రితమే అరెస్టయి, బెయిలుపై విడుదలయ్యారు. ఇన్ని రోజుల తర్వాత ఏసీబీ సోదాలు జరగడం, సుమారు రూ.5.92 కోట్ల విలువైన చర, స్థిరాస్తుల్ని గుర్తించడం గమనార్హం. అది బహిరంగ మార్కెట్‌లో ఆస్తుల విలువ 10 నుంచి 20 రెట్లు అధికంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. సదరు ఆస్తులకు లెక్కలు చూపడంలో భుజంగరావు విఫలం కావడంతో ఆయన్ను అరెస్టు చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. తుంగతుర్తిలో భుజంగరావు మామ ఇంట్లోనూ తనిఖీలు నిర్వహించేందుకు బృందాలు వెళ్లాయని, అక్కడ ఆ ఇంటికి తాళం వేసి ఉండటంతో వెనుదిరిగారు.గుర్తించిన ఆస్తుల వివరాలు :నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో 27.29 ఎకరాల వ్యవసాయ భూములుహైదరాబాద్‌లో 5 ఓపెన్ ప్లాట్లుదాదాపు రూ.3.83 లక్షల నగదుహైదరాబాద్‌లో రెండు ఇళ్లుహైదరాబాద్‌లో ఒక వాణిజ్య భవనంకిలో బంగారు ఆభరణాలుబ్యాంకు అకౌంట్‌లో రూ.8 లక్షలుమారుతి స్విఫ్ట్, కియా సెల్టోస్ కార్లుఎస్సైగా తొలి పోస్టింగ్ తర్వాత : సూర్యాపేట జిల్లా నూతన్‌కల్‌మండలం మిర్యాల గ్రామానికి చెందిన భుజంగరావు వ్యవసాయ కుటుంబం. 1991 బ్యాచ్ ఎస్సైగా ఎంపికై పోలీస్ శాఖలో ప్రవేశించిన ఆయన మొట్ట మొదట శామీర్‌పేటలో ఎస్సైగా మూడేళ్ల వరకు పనిచేశాడు. అనంతరం రెండేళ్లు మల్కాజిగిరిలో తర్వాత మూడు సంవత్సరాలు నాచారంలో మరో మూడేళ్లు వనస్థలిపురంలో ఎస్సైగా బాధ్యతలు నిర్వర్తించారు. 2005లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందాడు. అనంతరం సైబరాబాద్ స్పెషల్ బ్రాంచ్ లో పనిచేసి తర్వాత మాదాపూర్ ఎస్‌హెచ్‌వోగా నియమితులయ్యారు. 2011-14 కాలంలో ట్రాన్స్‌కో విజిలెన్స్ విభాగంలో డిప్యూటేషన్‌పై పనిచేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ డీఎస్పీగా బదిలీ అయ్యారు.ఎన్‌కౌంటర్ కేసు దర్యాప్తు అధికారిగా : బీఆర్ ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భుజంగరావు కూకట్ పల్లి ఏసీపీగా పోస్టింగ్ దక్కించుకున్నారు. అక్కడ ఉండగానే నయీం ఎన్‌కౌంటర్‌పై దర్యాప్తు అధికారిగా ఆయన్ను నియమించారు. నిజామాబాద్ డిచ్‌పల్లిలో నమోదైన బెదిరింపుల కేసు ఆధారంగా జరిగిన గాలింపుల క్రమంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. విచారణ నివేదికను న్యాయస్థానంలో సమర్పించిన అనంతరం భువనగిరి ఏసీపీగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న సమయంలోనే అదనపు ఎస్పీగా పదోన్నతి రావడంతో ఇంటెలిజెన్స్‌కు బదిలీ చేశారు. ఈ క్రమంలో అక్కడ ఉంటూనే ఫోన్ అక్రమ ట్యాపింగ్ బృందంలో ఆయన కూడా కీలకంగా వ్యవహరించారు.రెండేళ్ల నుంచి సస్పెన్షన్ కొనసాగింపు : మరోవైపు ఫోన్లను గుట్టుగా వినడం ద్వారా లభించిన సమాచారంతో పలువురిని బెదిరించి డబ్బుల వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు కొలువుదీరిన తర్వాత అతన్ని భూపాలపల్లి అదనపు ఎస్పీగా బదిలీ చేశారు. ఆ సమయంలోనే ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసు నమోదు కావడంతో 2024 మార్చి 23వ తేదీన భుజంగరావుని సస్పెండ్ చేసింది. ఇప్పటికీ ఇంకా సస్పెన్షన్ కొనసాగుతోంది. జులై నెలలో ఆయన పదవీ విరమణ చేయనున్న ఈ క్రమంలోనే తాజాగా ఏసీబీ సోదాలు జరగడం, ఆయన అరెస్టు కావడం విశేషం.

# రాష్ట్రంలో కొత్తగా రెండు జాతీయ రహదారుల విస్తరణ

**రూ. 7,597.16 కోట్ల అంచనా వ్యయంతో పనులు**

**ప్రధాని అధ్యక్షతన క్యాబినెట్ కమిటీలో ఆమోదం తెలిపిన కేంద్రం**

**దాదాపు 190 కిలోమీటర్ల వరకు నాలుగు వరుసల రోడ్డు**



గంటకు 100 కిలోమీటర్లు ప్రయాణించేలా డిజైన్‌కొత్తగా రెండు జాతీయ రహదారుల విస్తరణరోడ్ల అభివృద్ధిలో భాగంగా రాష్ట్రప్రభుత్వం కేంద్రానికి పలు ప్రతిపాదనలు పంపించింది. వాటిలో తాజాగా రెండు కొత్త జాతీయ రహదారులకు కేంద్రం అనుమతినిచ్చింది. బుధవారం ప్రధాని అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్? కమిటీ ఆమోదం దానికి తెలిపింది. ఆర్మూర్?-జగిత్యాల-మంచిర్యాల (ఎన్‌హెచ్-63), జగిత్యాల-కరీంనగర్(ఎన్‌హెచ్-563) సెక్షన్లను అభివృద్ధి చేయనున్నారు. అయితే ఈ రహదారుల అభివృద్ధి పనుల కోసం గత ఆర్థిక సంవత్సరంలోనే అవసరమైన ప్రక్రియను ఎన్‌హెచ్ఏఐ ఏర్పాటు చేసింది. తాజాగా కేంద్రం వీటికి ఆమోదం తెలపటంతో పనులు ప్రారంభం కానున్నాయి.రద్దీ తక్కువ : ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల (ఎన్‌హెచ్-63), జగిత్యాల-కరీంనగర్ (ఎన్‌హెచ్-563) ఈ రెండు జాతీయ రహదారులను ఏర్పాటు చేయటానికి ముఖ్య కారణాలు ఉన్నాయి. ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల ఈ మార్గం నిజామాబాద్?, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల మీదుగా వెళు ్తంది. అక్కాంపూర్, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, లక్షెట్టిపేట, మంచిర్యాల వంటి ప్రధాన ప్రాంతాలు ఈ మార్గంలోనే ఉన్నాయి. అలాగే జగిత్యాల-కరీంనగర్ పరిధిలో పోతారం, గంగాధర్, కరీంనగర్ వంటి ప్రాంతాలు ఉన్నాయి. దీంతో ఇక్కడ రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ సమస్యను అధికమించటానికే ప్రస్తుతం ఈ రెండు జాతీయ రహదారులను ఏర్పాటు చేస్తున్నారు. దీనికోసం ఇక్కడ బైపాస్ రోడ్లను నిర్మించనున్నారు. ఈ రెండు జాతీయ రహదారులను విస్తరించటంతో ఇక్కడ రాకపోకలు అంతరాయం కలగకుండా వేగం పుంజుకుంటుంది. అలాగే ఈ రోడ్లను గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా ఇప్పటికే డిజైన్ చేశారు.రెండు పద్ధతుల్లో విస్తరణ పనులు : వీటిని మొత్తం మూడు ప్యాకేజీలుగా విభజించి అభివృద్ధి పనులు ప్రారంభించనున్నారు. ఆర్మూర్?-జగిత్యాల-మంచిర్యాల రహదారి పనులను హ్యామ్? పద్ధతిలో, జగిత్యాల-కరీంనగర్ రోడ్డును బీవోటీ పద్ధతిలో చేపట్టనున్నారు. ఈ రెండింటినీ రూ. 7,597.16 కోట్ల అంచనా వ్యయంతో దాదాపు 190 కిలోమీటర్ల పరిధి వరకు నాలుగు వరుసల రోడ్డును విస్తరించనున్నారు. దీంతో ఆర్మూర్?-మంచిర్యాల మధ్య ప్రయాణ సమయం తగ్గనుంది.అనుసంధానత ఇలా: ప్రధానమంత్రి గతి శక్తి పథకానికి అనుగుణంగా రూపొందించిన ఈ రెండు జాతీయ రహదారి ప్రాజెక్టులు 5 ఆర్థిక కేంద్రాలు, 7 సామాజిక కేంద్రాలు, 8 లాజిస్టిక్స్ హబ్‌లకు అనుసంధానం చేయనున్నాయి.ఆర్థిక కేంద్రాలు : సిద్ధిపేట, వరంగల్ అర్బన్ ఎస్?ఈజెడ్?లు, నిజామాబాద్ సిద్దిపేటలో ఉన్న మెగా ఫుడ్ పార్కులు అలాగే రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఫిషింగ్- సీఫుడ్ క్లస్టర్.సామాజిక కేంద్రాలు : వేములవాడ, కొండగట్టు, నగునూర్ కోట, ధర్మపురి, కాళేశ్వరం, లోయర్ మానేర్ డ్యామ్, ఖిలా కోట.రైల్వే స్టేషన్లు : నిజామాబాద్, లింగంపేట్-జగిత్యాల్, పెద్దపల్లి, కోరుట్ల, మంచిర్యాలు, పొద్దూరు, గంగాధర, కరీంనగర్.ఆర్ఆర్ఆర్ ఉత్తర విభాగానికి టెండర్లు : గత నెల 20వ తేదీన రెండు ప్యాకేజీలుగా విభజించిన ఆర్ఆర్ఆర్ (రీజనల్ రింగ్‌రోడ్) ఉత్తర భాగంలోని పనులకు ఎన్‌హెచ్ఏఐ టెండర్లను ఆహ్వానించింది. సంగారెడ్డి జిల్లా గిర్మాపూర్ నుంచి సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ వరకు 83.518 కిలోమీటర్ల మేర ప్యాకేజీ-1కి టెండర్లు ఆహ్వానించారు. ప్యాకేజీ-2 కోసం, ప్రజ్ఞాపూర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా తంగడపల్లి వరకు 78 కిలోమీటర్లు బిడ్‌ల సమర్పణకు గడువు జూలై 7గా నిర్ణయించారు. గత నెలలో, పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ లో ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌కు తుది ఆమోదం తెలిపింది.

## యూకేలో ఉద్యోగాలంటూ ఎర - ప్రముఖ యూట్యూబర్ రమా నందన దంపతులపై కేసు



గత ఏడాది నవంబరులో ఓ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు - డెస్టినీ కన్సల్టెన్సీ పేరిట ఉద్యోగాలు, వీసా రెన్యువల్ పేరుతో పలువురి నుంచి పెద్ద మొత్తంలో వసూలుప్రముఖ యూట్యూబర్, 'నందూస్ వరల్డ్' ఛానల్ నిర్వాహకురాలు రమా నందన దంపతుల మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. డెస్టినీ కన్సల్టెన్సీ పేరిట వీరు ఉద్యోగాలు, వీసా రెన్యువల్ పేరుతో పలువురి నుంచి పెద్ద మొత్తంలో వసూలు చేసి ముఖం చాటేశారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం స్టేషన్‌లో గత ఏడాది నవంబరులో ఓ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. ఈ విషయం ఆలస్యంగా బయటకు వచ్చింది.యూకేలో స్థిరపడ్డ రమా నందన దంపతులు : గుంటూరుకు చెందిన జాగర్లమూడి మధుకర్, అన్నే రమా నందన దంపతులు యూకేలో స్థిరపడ్డారు. 'నందూస్ వరల్డ్' పేరుతో రమా నందన యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తోంది. ఆమె ఫ్యామిలీ వ్లాగ్స్ చేస్తుంటారు. వీరు గుంటూరు, విజయవాడ, హైదరాబాద్, తదితర ప్రాంతాల్లో డెస్టినీ కన్సల్టెన్సీ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. విద్య, ఉపాధి నిమిత్తం యూకే వెళ్లే వారి కోసం వీటిని ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొత్తూరుకు చెందిన శివ క్రాంతి కుమార్ లండన్‌లో చదువుకునే సమయంలో మధుకర్ పరిచయం అయ్యాడు. అక్కడ కొన్నాళ్లు ఉద్యోగం చేసి, తిరిగి ఇబ్రహీంపట్నం వచ్చారు. అతని భార్య వినీల కూడా లండన్‌లోనే చదువుకుంది. వీరికి ఇక్కడే వివాహమైంది.మధుకర్ సూచించిన ఖాతాలకు రూ. 15 లక్షలు : వీసా రెన్యువల్‌తో పాటు భార్య వినీలకు సీవోఎస్ (సర్టిఫికెట్ ఆఫ్ స్పాన్సర్‌షిప్), ఉద్యోగ అవకాశం కోసం శివక్రాంతి మధుకర్‌ను సంప్రదించారు. గుంటూరులోని డెస్టినీ కన్సల్టెన్సీ కార్యాలయానికి వెళ్లాలని, అక్కడ తన తండ్రి మోహన్‌రావు ఉంటారని, మొత్తం రూ. 15 లక్షలు అవుతుందని చెప్పాడు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేసి పదవీ విరమణ చేసిన మధుకర్ తండ్రి హరిబాబును గుంటూరులో 2023లో శివక్రాంతికుమార్ కలిశారు. డబ్బులను రెండు ఖాతాలకు బదిలీ చేయాలని వివరాలను మధుకర్ వాట్సాప్‌లో పంపించాడు. వ్యక్తిగత రుణంతో పాటు బంధువుల నుంచి డబ్బును సమకూర్చుకున్నారు. హరిబాబును తీసుకుని, ఇబ్రహీంపట్నంలోని బ్యాంకుకు వెళ్లి అక్కడి నుంచి మధుకర్ సూచించిన ఖాతాలకు రూ. 15 లక్షలు బదిలీ చేశారు.నగదు చెల్లించి రెండు నెలలు అయినా వీసా రెన్యువల్, సీవోఎస్ జాడ లేకపోవడంతో శివక్రాంతి ఒత్తిడి చేశాడు. అగార్డ్ సొల్యూషన్స్ పేరుతో మధుకర్ సర్టిఫికెట్ ఆఫ్ స్పాన్సర్‌షిప్‌ను పంపించారు. దీనిపై ఆ కంపెనీలో ఆరా తీయగా దాని యజమాని ఫైజల్, కొంత కాలం వేరే దేశంలో ఉన్నానని, ఆ సమయంలో తన పేరుతో మధుకర్ తప్పుడు లేఖ ఇచ్చి ఉండొచ్చని సమాధానమిచ్చారు. అప్పటి నుంచి ఉద్యోగం వద్దని, కనీసం డబ్బులు అయినా ఇవ్వమని గట్టిగా నిలయదీయడంతో రూ. 2 లక్షలు మాత్రమే తిరిగి ఇచ్చారు. దీంతో గత ఏడాది నవంబరులో శివక్రాంతి ఫిర్యాదు చేయగా ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏ1గా మధుకర్, ఏ2గా రమా నందన, ఏ3గా మోహన్‌రావులను చేర్చారు. వీరికి విచారణ నిమిత్తం పోలీసులు నోటీసులు పంపించినా స్పందన లేదు.ఒకొక్కరి నుంచి రూ. 20 లక్షలు : ఈ కేసును క్వాష్ చేయాలని నిందితులు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఇది విచారణ దశలో ఉంది. ఏపీ, తెలంగాణతో పాటు గుజరాత్, రాజస్థాన్, బీహార్, తదితర రాష్ట్రాలకు చెందిన పలువురు బాధితులు ఉన్నట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఒక్కొక్కరి నుంచి రూ. 20 లక్షలు చొప్పున వసూలు చేసినట్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.ఈ ఆరోపణలపై యూట్యూబర్ రమా నందన ఆమె ఛానల్‌లో వివరణ ఇచ్చారు. 'తమ కుటుంబం గురించి కొందరు వ్యక్తిగత కక్షతో నెగిటివ్ ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కొందరు వ్యక్తులపై యూకేలో చట్టపరంగా చర్య తీసుకున్నామన్నారు. ఇక్కడి నుంచి భారత్ వెళ్లి.. పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారని తెలిపారు. నాపైన, నా భర్తపైన ఇండియాలో ఎటువంటి కంపెనీలు లేవని, మా పేర్లు చెప్పి కొందరు ఇండియాలో సొమ్ము చేసుకుంటున్నారని ఆమె అన్నారు. మా కంపెనీ పేర్లను కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. ఇటువంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండండి' అని వివరించారు.

# 'నా కొత్త స్నేహితురాలు ఇదిగో'

**ఎక్స్ వేదికగా పరిచయం చేసిన సీఎం చంద్రబాబు!**

**ఐ మేడ్ ఏ లిటిల్ ఫ్రెండ్ టుడే అంటూ చంద్రబాబు పోస్ట్**

**నెటిజన్ల కామెంట్లు , లైక్‌తో చంద్రబాబు సోషల్ మీడియా హ్యాండిల్స్ షేక్**



సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి చంద్రబాబు యాక్టివ్‌గా ఉంటుంటారు! రోజువారీ కార్యకలాపాలను పంచుకుంటుంటారు. కాకపోతే రోజూ పెట్టుబడులు, సమీక్షల గురించే పోస్టులు వస్తుంటాయి. అలాంటి చంద్రబాబు సోషల్ మీడియా ఖాతాలో "ఐ మేడ్ ఏ లిటిల్ ఫ్రెండ్ టుడే" అంటూ బుధవారం కనిపించిన ఓ పోస్ట్ అభిమానులు, నెటిజన్లను తెగ ఆకర్షించేసింది. ఆ పోస్ట్‌కు ఓ వీడియోను కూడా ట్యాగ్ చేశారు సీఎం. ఆ వీడియోలోని చిన్నారినే కొత్తఫ్రెండ్‌గా పరిచయం చేశారు. ఇప్పుడీ ఈ పోస్ట్ నెటిజన్ల కామెంట్లు , లైక్‌లతో చంద్రబాబు సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను షేక్ చేస్తున్నాయి.వీడియోలో చంద్రబాబు ఆ పాపను ముద్దుచేయడం, ఆ చిన్నారి కూడా బోసినవ్వుతో ఆయణ్ని ఆప్యాయంగా చూడడం నెటిజన్లను ఆకట్టుకుంది. కొత్త ఫ్రెండ్స్‌కు కామెంట్లు, లైక్‌ల రూపంలో అభిమానులు ఆల్‌దిబెస్ట్ చెప్పేశారు. ఆంధ్రప్రదేశ్ మీ చేతుల్లో సంతోషంగా ఉందని, కల్లాకపటం తెలియని పాప చెప్తోందంటూ కొందరు కాంమెట్ చేశారు. ఇద్దరు పసిపిల్లలు కబుర్లు చెప్పుకుంటున్నట్టు ఉందని మరికొందరు సరదా కామెంట్స్ పెట్టారు. స్నేహానికి ఏజ్‌బార్ ఉండదంటే ఇదేనేమో అంటూ కొందరు చమత్కరించారు.సీఎం చంద్రబాబు బుధవారం గుంటూరు పర్యటన సందర్భంగా ఈ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. తక్కెళ్లపాడులోని లలిత ఆసుపత్రి ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రికి, డాక్టర్ రాఘవశర్మ, డాక్టర్ విజయ కుటుంబ సభ్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాఘవశర్మ మనవరాలిని చంద్రబాబు ఎత్తుకుని ముద్దు చేశారు. ఆ తర్వాత వాళ్ల అమ్మ ఎత్తుకోవటానికి చేతులు చాపీనా వెళ్లలేదు. చిరునవ్వులు చిందిస్తూ సీఎం వద్దే ఉండిపోయింది. దీంతో ముఖ్యమంత్రి ఆ పాప తీరుపై ముగ్ధులయ్యారు. ఎంతలా అంటే కార్యక్రమం అనంతరం 'నాకు ఇవాళ కొత్త స్నేహితురాలు దొరికిందని' చంద్రబాబు ఎక్స్ వేదికగా వీడియో పోస్ట్ చేశారు. అంతకుముందు చంద్రబాబు లలితా గ్రూప్ నూతనంగా నిర్మించిన 600 పడకల ఆసుపత్రిని ప్రారంభించారు. ఆసుపత్రిలోని ముఖ్యమైన విభాగాలను పరిశీలించారు. అత్యాధునిక ఎంఆర్ఐ యంత్రాన్ని పరిశీలించి పనితీరు, ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. ఆధునిక వైద్యపరికరాలు, ఏఐ సాంకేతికత వినియోగం, ఆన్‌లైన్‌లో రోగుల హెల్త్ రికార్డులు వంటి అంశాలపై ఆరా తీశారు. 32 విభాగాల్లో ఒకేచోట వైద్యసేవలు అందించేలా హాస్పిటల్ ను నిర్మించిన యాజమాన్యాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. లలితా ఆసుపత్రి ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందాలని చంద్రబాబు ఆకాంక్షించారు.ఆరోగ్యవంతులైన ప్రజలు సంపన్నమైన దేశాన్ని నిర్మిస్తారని చంద్రబాబు పేర్కొన్నారు. రూ.వేల కోట్లు, ప్యాలెస్‌లు ఉన్నా ఆరోగ్యం లేకపోతే ఉపయోగం లేదని స్పష్టంచేశారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ స్థాపనే లక్ష్యంగా రాష్ట్రంలో సంజీవని ప్రాజెక్టు తీసుకువచ్చామని చెప్పారు. డిజిటల్ ఆరోగ్యకార్డుల ద్వారా ప్రపంచంలోని విజ్ఞానాన్ని, మంచి విధానాలను తీసుకొచ్చి 42 పరీక్షలు ఇంటివద్దే చేసి అక్కడే వైద్యం అందించేలా సంజీవని పనిచేస్తుందన్నారు. ప్రివెంటివ్, ప్రెడిక్టివ్, క్యూరేటివ్ విధానానికి శ్రీకారం చుట్టామని చంద్రబాబు వివరించారు.మనిషికి ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదని చంద్రబాబు తెలిపారు. ఎంత సంపద ఉన్నా ఆరోగ్యం లేకపోతే లాభం ఉండదన్నారు. ఆహారమే ఔషధం కావాలని చెప్పారు. వంటిల్లు మందుల దుకాణంలా ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. మన తిండి, పరిసరాలు, ఆలోచించే విధానం, అలవాట్లు, వ్యాయామం ఆరోగ్యాన్ని పెంచుకునేందుకు ఉపయోగపడతాయని వివరించారు. ఏపీని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తయారు చేయాలనేది తన ఆశయమని వెల్లడించారు. హెల్దీ, వెల్దీ, హ్యాపీ సొసైటీ రావాలంటే అన్ని వర్గాలూ కలిసి పనిచేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com